క్లుప్తంగా

ప్రాణాలు పోతున్నాయ్..



సింగరేణి పీఓ నర్సింహారావును అడ్డుకున్న గ్రామస్తులు

సత్తుపల్లిరూరల్: సైల్ బంకర్ కాలుష్యం కారణంగా కిష్టారం అంబేడ్కర్‌నగర్ కాలనీవాసుల ప్రాణాలు పోతున్నాయని వారు ఆందోళన నిర్వహించారు. ఆదివారం కాలనీ సమస్యలను పరిశీలించేందుకు వచ్చిన కిష్టారం ఓసీ పీఓ నర్సింహారావును అడ్డుకుని.. తమ ఆవేదనను వెలిబుచ్చారు. ఇప్పటికే కాలుష్య ప్రభావంతో ప్రాణాలు కోల్పోయామన్నారు. ఈ సమస్యను పరిష్కరించకుంటే ఓపెన్‌కాస్టులోకి వెళ్లి సింగరేణి బొగ్గు ఉత్పత్తి పనులను అడ్డుకుంటామని, కాలుష్యాన్ని నివారించాలని కాలనీ వాసులు డిమాండ్ చేశారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం



నగదు అందిస్తున్న దాతలు

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని ద్వారకాపురి7వ లైన్లో నిర్మాణంలో ఉన్న శ్రీప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయానికి డాక్టర్ పుతుంబాక అనీల్ కుమార్, డాక్టర్ లక్ష్మీప్రశాంతి, మోనిషా, సీతాపతిరావు, నాగమాంబ కుటుంబ సభ్యులు ఆదివారం రూ.లక్ష విరాళంగా అందించారు. వారి కుటుంబాన్ని వేంకటేశ్వరస్వామి చల్లగా చూడాలని ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ బాధ్యులు ద్రోణంరాజు మల్లికార్జున శర్మ, వందనపు సత్యనారాయణ, రాగాల చంద్రారెడ్డి, సోమిశెట్టి శ్రీధర్ పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్‌కు రూ.11వేలు..



షఫీకి నగదు అందిస్తున్న ఆటో డ్రైవర్లు

కారేపల్లి: ఇటీవల అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న కారేపల్లి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ షేక్ షఫీకి, తోటి ఆటో డ్రైవర్లు (ఖమ్మం ఆటోఅడ్డా) తెలంగాణ ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం రూ.11వేలు ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా.. తెలంగాణ ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు నాగవెల్లి ప్రభాకర్ మాట్లాడారు. ఆటో డ్రైవర్ల సంక్షేమానికి ప్రభుత్వాలు నిధులు మంజూరు చేయాలని, గుర్తింపు ఉన్న ఆటోడ్రైవర్ల కుటుంబాలకు రుణ సౌకర్యం కల్పించి, వారికి ఆర్థిక భరోసా కల్పించాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ ఆటో వర్కర్ల యూనియన్ నాయకులు దుండి సైదులు, చింతల శ్రీను, దంతాల వెంకట్, జయం నాగేశ్వరరావు, బాణాల రాము, సూరి తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు..

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని జవహర్‌నగర్‌కు చెందిన ఉప్పు గురవయ్య సతీమణి వెంకటనర్సమ్మ(55) గుండెపోటులో ఆదివారం మృతి చెందింది. ఆమె అంత్యక్రియలకు వడ్డెర సంఘం ఆధ్వర్యాన ఆ సంఘం బాధ్యులు రూ.8వేలు ఆర్థికస ఆయం అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ అద్దంకి అనిల్, వడ్డెర సంఘం బాధ్యులు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ



సరుకులు అందజేస్తున్న గ్రూప్ సభ్యులు

చింతకాని: మండలంలోని నాగులవంచ గ్రామంలోని నిరుపేద వృద్ధురాలు ధర్మపురి సక్కుబాయి కుటుంబానికి 'ఆకలి అందరిది' అను గ్రూపు సభ్యులు ఆదివారం నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు ప్రతి ఒక్కరూ చేయూత అందించాలని తెలిపారు. సామాజిక సేవతోనే సమాజాభివృద్ధి జరుగుతుందన్నారు. గత ఐదు సంవత్సరాల నుంచి నిరుపేద కుటుంబాలకు నిత్యావసర వస్తువులను అందజేయటం జరుగుతుందని తెలిపారు. దీంతో వృద్ధురాలిని ఆదుకున్న గ్రూప్ సభ్యులను గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో లచ్చయ్య, సుబ్బారావు, మదన్, గోపి, ఫణిరాజు, బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

వేగం కన్నా.. ప్రాణం మిన్న

రోడ్డు ప్రమాదాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్న పోలీసులు



పమ్మి క్రాస్ రోడ్డు వద్ద బోల్తాపడిన టిప్పర్ (ఫైల్)

ముదిగొండ: రోజు రోజుకు వాహనాల సంఖ్య గణనీయంగా పెరిగిపోతున్నాయి. ప్రతీ పనికి బయటకు రావాలంటే ఏదో ఒక వాహనం వాడాల్సిందే. ట్రాఫిక్ రూల్స్ పాటిస్తే మేలే, కాని ఇష్టారాజ్యంగా అతి వేగంగా వాహనాలను నడపడంతో ప్రమాదాలు పెరిగిపోతున్నాయి. రోడ్డు ప్రమాదాలను నివారించాలనే లక్ష్యంతో ఆటంకం లేని సురక్షిత వాహన ప్రయాణం చేసే దిశగా పోలీసు యంత్రాంగం శతవిధాలుగా కృషి చేస్తున్నారు. గ్రామాల వారీగా పోలీసులు పెట్రోలింగ్‌లు, బ్లూకోర్టు, కానిస్టేబుళ్ల పర్యవేక్షణ నిర్వహిస్తున్నారు.

ప్రమాదాలు ఇలా ..

వాహనాలను మితిమీరిన వేగంతో నడపడం వలన అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నాయి. టైర్లు పగిలి, ఎదుటి వాహనాలను ఢీ కొట్టటం, సడెన్ బ్రేకులు వేయటం లాంటివి కారణాలు ప్రమాదాలకు కారణం అవుతున్నాయి. పరిమితికి మించి ఆటోల్లో ప్రయాణికులను ఎక్కించడంతో పాటు, ద్విచక్రవాహనాలపై ముగ్గురు, నలుగురుతో ప్రయాణించడం ప్రమాదాలకు కారణాలు అవుతున్నాయి. కొందరు వాహనాల లైట్లు సరిగా అగపడక ఫోకస్ లైట్లు పెట్టిస్తుంటారు. ఈ క్రమంలో ఎదురుగా వచ్చే వాహనాలు అగపడక ప్రమాదార భారిన పడిన సంఘటనలు అనేకం. రాత్రి సమయంలో ప్రయాణించే వాహనదారులు లైట్లతో పాటు పార్కింగ్ లైట్లు వేసుకుని ప్రయాణించాలి. డ్రైవింగ్ చేసేటప్పుడు హెడ్‌సెట్ పెట్టుకోని ఫోన్ మాట్లాడుతుంటారు. వర్షాకాలంలో చక్రాలు జారుతుంటాయి. సడెన్ బ్రేకులు వేస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది. నిద్ర మత్తులో వాహనాలు నడపవద్దన్నారు. రాత్రివేళలో తప్పనిసరి అయితే మాత్రమే ప్రయాణించాలని పోలీసులు తెలియజేస్తున్నారు.



అవగాహన కల్పిస్తున్న పోలీసులు (ఫైల్)

హెల్మెట్ తప్పనిసరి..

వాహనదారులు హెల్మెట్ ధరించకుండా ప్రయాణించిన వాహనదారులే ఎక్కువశాతం ప్రమాదాలకు గురై మృత్యువాత పడుతున్నారు. ప్రాణాలకు కాపాడడంలో హెల్మెట్ ముఖ్య పాత్ర పోషిస్తుందన్నారు. వెంట్రుకలు ఊడిపోతాయోనని, క్రాఫ్‌చెడిపోతుందని, ముఖం అగపడాలని చాలామంది యువకులు హెల్మెట్ ధరించడం లేదు.

నిబంధనలు ఇలా..

- నరదాకోసం అతివేగం వద్దు.
- సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దు.
- వాహనదారులు ఓవర్‌టేక్ చేశారనే అహం వద్దు.
- మూలమలుపుల వద్ద అస్సలు ఓవర్‌టేక్ చేయొద్దు.
- బైక్‌పై ఇద్దరికి మించి ప్రయాణం చేయొద్దు..
- హెల్మెట్ తప్పనిసరి.
- లైసెన్స్ లేని వారు, మద్యం సేవించిన వారు వాహనాలు నడపొద్దు.
- సీటుబెల్ట్ పెట్టుకుని డ్రైవింగ్ చేయాలి.

నిత్యం తనిఖీలు చేస్తున్నాం..



ప్రధాన రహదారిపై వాహనాలు అతి వేగంగా వెళ్లకుండా, చర్యలు తీసుకుంటున్నాం. నిత్యం తనిఖీలు చేపట్టి సరైన పత్రాలు లేని వాహనాలపై జరిమానా విధిస్తున్నాం. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నాం. మైనర్లు ద్విచక్రవాహనాలు నడిపితే కేసు నమోదు చేసి వాహనం సీజ్ చేస్తాం. ఇసుక ట్రాక్టర్లకు అనుమతులు ఉండాలని, లైడ్ స్పీకర్లు పెట్టి వాహనాలు నడపొద్దన్నారు. ఈ మేరకు చాలా ప్రాంతాల్లో వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నాం.

– వడ్డెబోయిన మురళి, సీఐ, ముదిగొండ

ఆర్మీ జవాన్ల త్యాగాలు మరువలేనివి

కొణిజర్ల: ఎండా, వాన, చలిని లెక్క చేయకుండా దేశ రక్షణ కోసం తన ప్రాణాలు పణంగా పెట్టే ఆర్మీ జవాన్ల త్యాగాలు మరువలేనివని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. మండలంలోని అన్నవరం గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ చల్లా శ్రీనివాస్ గత ఏడాది ఫిబ్రవరిలో వరంగల్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆయన ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని కుటుంబ సభ్యులు తమ వ్యవసాయ క్షేత్రంలో శ్రీనివాస్ విగ్రహాన్ని ఏర్పాటు చేయగా.. ఆదివారం ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ఆవిష్కరించి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, కాంగ్రెస్ నాయకులు రామారావు, రోశయ్య, పుల్ల య్య, ఐవీఓ స్టేట్ స్పోక్స్ పర్సన్ సత్యమూర్తి అరుణ్, జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి, జిడుగు న్మంతరావు, ఆర్మీజవాన్ శ్రీనివాస్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



జవాన్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్, నాయకులు

ఉపాధ్యాయుల సంక్షేమమే ప్రధాన లక్ష్యం



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి రంగారావు

మధిర: ఉపాధ్యాయుల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా పీఆర్‌టీయూ పనిచేస్తూ ముందుకు సాగుతుందని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. రంగారావు తెలిపారు. మధిర పీఆర్‌టీయూ కార్యాలయంలో పీఆర్‌టీయూ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆదివారం నిర్వహించి మాట్లాడారు. విద్యారంగం బలోపేతానికి పీఆర్‌టీయూ ఎంతో కృషి చేస్తుందన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ముందుండాలని సూచించారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సాయి కృష్ణమాచార్యులు, రాష్ట్ర బాధ్యులు వెంకటేశ్వరరావు, మదార్, తూమాటి కృష్ణారెడ్డి, జిల్లా బాధ్యులు బ్రహ్మారెడ్డి, రవికుమార్, కొమ్ము శ్రీనివాసరావు, మండల అధ్యక్ష, కార్యదర్శులు చిలుకూరి సత్యనారాయణ, పోలె సుధాకర్, ఎర్రుపాలెం మండల అధ్యక్షుడు మదన్‌మోహన్ రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక ధోరణులు రూపుమాపాలి

బోనకల్: అంతరాలు పెంచే సామాజిక ధోరణులు రూపుమార్చడం ద్వారా మెరుగైన సమాజాన్ని నిర్మించవచ్చని పల్లె ఫౌండేషన్ అధ్యక్షుడు పల్లా కొండల్‌రావు అన్నారు. మండలంలోని చొప్పకట్ల పాలెం గ్రామంలో పల్లె ప్రపంచం ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'కలిసుంటే ఆనందం – ఆదిపత్యంతో అంతరాలు' అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డబ్బు జబ్బు, నికర ఆదిపత్య దోరణలు, అంతరాలను పెంచే సామాజిక దోరణలు, ఆచారాలను వదిలించుకుంటేనే మనిషి ఋషిగా మారతారన్నారు. తేలిక కాకున్నా అది అసాధ్యం మాత్రం కాదన్నారు. కలిసి శ్రమించే సంస్కృతి ఉన్నప్పుడే అసలైన ఆనందం, విలువలు తెలుస్తాయన్నారు. ప్రస్తుత సమాజంలో ఓటుతో సహా ప్రతిదీ సరుకుగా మారిందన్నారు. పెట్టుబడి ప్రతి నట్టింట్లో విలయతాండవం చేస్తుందన్నారు. అవసరం కోసం ఉత్పత్తి కాకున్నా అమ్మకం కోసం ఉత్పత్తి చేసే సమాజం ఉండడం దీనికి కారణమన్నారు. ఈ కార్యక్రమంలో దొండపాటి నాగేశ్వరరావు, కిలారు సురేష్, బందం శ్రీనివాసరావు, సునీత, అప్పాచారి, అజయ్‌కుమార్, హరికిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొండల్‌రావు

మహాధర్నాను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న విఠల్‌రావు

పెనుబల్లి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు వ్యతిరేకంగా ఈ నెల 10న హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యాన నిర్వహిస్తున్న మహాధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు చలమాల విఠల్‌రావు పిలుపునిచ్చారు. ఆదివారం మండల పరిధిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల కనీస వేతనం పెంపుదల, శ్రామిక రంగాల మెరుగుదల, బడ్జెట్‌కు వ్యతిరేకంగా ఈ మహాధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుడిమెట్ల బాబు, ఎస్‌కె.రాజి, మిద్దె స్వామి, మస్తాన్, ఎ.లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏన్కూరులో..

ఏన్కూరు: హైదరాబాద్‌లో నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు పిలుపునిచ్చారు. ఆదివారం ఏన్కూరులో నిర్వహించిన ప్రజా సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా రైతు ఉద్యమం గత ఐదేళ్లగా రైతులు వివిధ రూపాల్లో చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నాయకులు లక్ష్మా, లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

నాగచందర్‌రావుకు డాక్టరేట్



నాగచందర్‌రావు

మధిర: మండలంలోని దెందుకూరు గ్రామానికి చెందిన పగిడిపల్లి నాగచందర్ రావుకు డాక్టరేట్ లభించింది. కాకతీయ విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య రాజేందర్ కట్ల ఆయనకు డాక్టరేట్ ప్రకటించారు. నాగచందర్‌రావు 'ట్రేస్ట్ విత్ ఇండియా ఏ స్టడీ నైపాల్స్ ఇండియా ట్రావెలాగ్స్' అను అంశంపై విభాగ విశ్రాంత ఆచార్యులు ఆచార్య జి.దామోదర్ పర్యవేక్షణలో సమర్పించిన గ్రంథానికి డాక్టరేట్ లభించిందని తెలిపారు. నాగచందర్‌రావు ప్రస్తుతం మంచిర్యాల జిల్లా చెన్నూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. నాగచందర్‌రావును కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నేత్రదానం



వైరాలో నేత్రాలు సేకరిస్తున్న ఖమ్మం నేత్రనిధి సభ్యులు

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డుకు చెందిన నాగేశ్వరరావు అనారోగ్యంతో ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఆయన కుటుంబ సభ్యులు ఆయన నేత్రాలు దానం చేసేందుకు ముందుకు రాగా ఖమ్మం నేత్రనిధి వారికి వైరా లయన్స్‌క్లబ్ వారు సమాచారం అందించగా.. వారు నేత్రాలు సేకరించారు. ఈ సందర్భంగా మృతుడి కుమారులు నరేందర్, సురేందర్ లను లయన్స్‌క్లబ్ సభ్యులు అభినందించారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు చింతలపూడి వెంకటేశ్వరరావు, డాక్టర్ పెరుమాళ్ల కృష్ణమూర్తి, గజ్జల కృష్ణమూర్తి, శ్రీనివాసరావు, కృష్ణార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

రిసెప్షన్ వేడుకలో మంత్రి తుమ్మల

కొణిజర్ల: కొణిజర్ల మండల కేంద్రానికి చెందిన సీపీఐ సీనియర్ నాయకుడు దొండపాటి కిషన్‌రావు–నాగమణి దంపతుల పెద్దకుమారుడి వివాహం ఈ నెల 8న హైదరాబాద్‌లో జరగ్గా.. ఆదివారం కొణిజర్లలో నిర్వహించిన రిసెప్షన్ వేడుకకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

మాజీ ఎంపీ పరామర్శ

ఎర్రుపాలెం: మండలంలోని మీనవోలు మాజీ ఎంపీటీసీ, బీఆర్‌ఎస్ నాయకుడు కుడుముల మల్లికార్జన్‌రెడ్డి ఇటీవల మోకాలికి శస్త్రచికిత్స చేయించుకోగా.. ఆదివారం మాజీ ఎంపీ నామ క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ కనకమేడల సత్యనారాయణ ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు ఫోన్‌లో మాట్లాడి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నాయకులు తన్నీరు రవికుమార్, తాళ్లూరి హరీష్‌బాబు తదితరులున్నారు.

50 ఏళ్ల జ్ఞాపకాలతో.. ఆత్మీయ సమ్మేళనం

ముదిగొండ: మండలపరిధిలోని వెంకటాపురంలో గల ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముదిగొండ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1974 సంవత్సరం నుంచి 1990 వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులు ఒకే వేదికపై 50 ఏళ్ల తరువాత కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకుని నాటి జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ ఆనందంగా గడిపారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన నాటి గురువులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కార్పొరేటర్ కూరపాటి మురళి, బస్వోజు మల్లిఖార్జున్, బంకా గురవయ్య, అనంతరాములు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



సమ్మేళనంలో గురువును సన్మానిస్తున్న పూర్వవిద్యార్థులు

ఆలయంలో ప్రత్యేక పూజలు

మారెమ్మతల్లి ఆలయంలో ఎమ్మెల్యే రాగమయి..

కల్లూరురూరల్: కల్లూరు ఎన్‌ఎస్‌పీ క్రాస్‌రోడ్‌లో గల మారెమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం ఎమ్మెల్యే మట్టా రాగమయి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మేడా ప్రేమ్‌చంద్ భువనేశ్వరిల కుమారుడు అచ్యుత్ అన్నప్రసాద కార్యక్రమానికి హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. మారెమ్మ ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యేకి నిర్వాహకులు మేచర్ల నాగమల్లేశ్వరరావుతో పాటు భక్తులు ఘనంగా సన్మానించారు. ఆలయ ప్రాంగణంలో నీటి కొరత ఉందని, ఒక బోర్‌ను మంజూరు చేయాలని ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేను కోరారు. అనంతరం పెద్దకోరుకొండిలోని దేవరపు సత్యనారాయణ కుమారుడు వివాహం జరగ్గా వరుడ జయహేశ్, వధువు యామినీలను ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ భాగం నీరజాదేవి, కాంగ్రెస్ పార్టీ నాయకులు లక్కినేని కృష్ణ, పుల్లాచారి, రాజబోయిన శ్రీనివాసరావు, కుందాల గురవయ్య పాల్గొన్నారు.

జమలాపురం ఏడుకొండలస్వామిని దర్శించుకున్న టెన్త్ విద్యార్థులు..

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతి జమలాపురం వేంకటేశ్వరస్వామి వారి ఆలయాన్ని ఆదివారం మండలంలోని మీనవోలు శ్రీభాస్కర మెమోరియల్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులు సందర్శించి స్వామిని దర్శించుకున్నారు. దేవుడా వచ్చే నెలలో నిర్వహించనున్న పదో తరగతి పరీక్షలు బాగా రాసేలా చూడు స్వామీ అంటూ మొక్కుకున్నారు. మీనవోలు గ్రామంలోని పాఠశాల నుంచి జమలాపురం వరకు 12 కి.మీ మేరకు కాలినడకన శ్రీవారి ఆలయానికి విద్యార్థులు చేరుకున్నారు. హుండీల్లో కానుకలు సమర్పించుకున్నారు. విద్యార్థుల వెంట హెచ్‌ఎం వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు సంధ్య, జానకి, రామిరెడ్డి, వాసు తదితరులున్నారు.



ఆలయాన్ని సందర్శించిన విద్యార్థులు

ఇస్లాం శాంతి ధర్మాన్ని ప్రబోధిస్తుంది



జామియా మసీద్ సందర్శనలో ఎమ్మెల్యే రాగమయి

కల్లూరు: ఇస్లామ్ శాంతి ధర్మాన్ని ప్రబోధిస్తుందని ప్రముఖ ఇస్లాం దైవ ధార్మి సందేశకులు మహ్మద్ యూసఫ్, రఫీలు పేర్కొన్నారు. జాతీయ సమైఖ్యత, మత సామరస్యాన్ని చాటి చెప్పాలనే సంకల్పంతో కల్లూరులోని జామియా మసీదులో ఆదివారం నిర్వహించిన మసీదు సందర్శన కార్యక్రమంలో వారు మాట్లాడారు. విశ్వాసంలో దైవ ఆరాధనలు చేసిన వారు స్వర్గ ప్రాప్తి పొందుతారని, ముస్లింలు తమ జీవితంలో తప్పనిసరిగా నమాజ్ చేయాలని, ఖురాన్ పఠించాలని, జకాత్‌లు, ధాన ధర్మాలు చేయాలన్నారు. పరిశుద్ధ విశ్వాసంతో ప్రార్థనలు చేసినప్పుడు మాత్రమే దైవ ప్రవక్త స్వీకరిస్తారని పేర్కొన్నారు. మసీదు సందర్శనలో ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి పాల్గొని మాట్లాడుతూ.. భారతీయ ముస్లిం సమాజ విలువలు, సంస్కృతి తెలియజేయడానికి అవగాహన కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ భాగం నీరజదేవి, కాంగ్రెస్ నాయకులు పసుమర్తి చందర్‌రావు, లక్కినేని కృష్ణ, పెద్దబోయిన శ్రీను, షేక్. బాజి, యాకూబ్ అలీ, ముస్లిం ప్రముఖులు మసీద్ సదర్ ఎండీ హనీఫ్, మండల ముస్లిం కమిటీ అధ్యక్షులు సయ్యద్ అలీ, ఎస్‌కె.యాకూబ్‌అలీ, ఎస్‌కె.అమీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి పనుల అడ్డగింత

చింతకాని: మండలంలోని సీతంపేట నుంచి తిమ్మినేనిపాలెం వరకు నిర్మిస్తున్న బీటీ రహదారి నిర్మాణ పనులను సీతంపేట గ్రామ రైతులు ఆదివారం అడ్డుకున్నారు. రహదారి నిర్మాణ పనులను చేస్తున్న క్రమంలో జేసీబీకి వ్యవసాయ విద్యుత్ తీగలు తగిలి ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవటమే కాకుండా ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫ్యూజులు పోయి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ సరఫరా లేకపోవటంతో పంట పొలాలకు సాగు నీరు అందించలేకపోతున్నామని, ఈ విషయమై కాంట్రాక్టర్ అడగ్గా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. తక్షణమే వ్యవసాయ విద్యుత్ మోటార్ల మరమ్మతులు చేయించి విద్యుత్ సరఫరాలను పునరుద్ధరించాలని కోరుతున్నారు. కార్యక్రమంలో రైతులు షేక్ ఖాజా, చంద్రకాని బాబు, జక్కుల నాగేశ్వరరావు, జాలా రమేష్, షేక్ ఉస్మాన్, గఫూర్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



సీతంపేటలో రోడ్డు పనులను అడ్డుకున్న గ్రామస్తులు

రూ.6.95 కోట్ల నిధులు మంజూరు

చింతకాని: మండలంలోని మత్కేపల్లి నుంచి తిరుమలాపురం గ్రామం రకు రహదారి, బ్రిడ్జి నిర్మాణానికి డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క రూ.6.95 కోట్ల నిధులను మంజూరు చేశారు. గతేదాది వచ్చిన వరదలకు మత్కేపల్లి–తిరుమలాపురం గ్రామాల మధ్య ఉన్న బ్రిడ్జి, రహదారి పూర్తిగా ధ్వంసమయ్యాయి. అప్పుడు భట్టివిక్రమార్క పరిశీలించారు. బ్రిడ్జి, రహదారి నిర్మాణానికి నిధులను మంజూరు చేసినందుకు గానూ భట్టికి మత్కేపల్లి, తిరుమలాపురం గ్రామ కాంగ్రెస్ నాయకులు, రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

అసంపూర్తి పనులతో అవస్థలు



చిరుమర్రి వద్ద చప్టా పనులు మధ్యలోనే వదిలేసిన దృశ్యం

ముదిగొండ: మండలంలోని పలు రోడ్ల నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. దీంతో ప్రజలు నిత్యం అవస్థలు పడుతున్నారు. ముదిగొండ నుంచి న్యూలక్ష్మీపురం, సువర్ణాపురం, చిరుమర్రి రహదారిపై మరమ్మతుల కోసం కంకర పరిచి ఏడాది కావస్తున్నా.. ఇప్పటి వరకు రోడ్డే వేయలేదు. దీంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డు విషయమై పట్టించుకున్న నాథుడే లేడని గ్రామస్తులతో పాటు ప్రయాణికులు వాపోతున్నారు. కొందరు కంకరపై ప్రయాణించే సమయంలో కిందపడి గాయాలపాలైన సంఘటనలు అనేకం. ఇదిలా ఉండగా చిరుమర్రి సమీపంలో చప్టాను ఎత్తు పెంచేందుకు నిర్మాణ పనులు చేయించి, మధ్యలో వదిలేశారు. ప్రతి రోజు పలు వాహనదారులకు తలనొప్పి తప్పడం లేదని ఆరోపిస్తున్నారు. సంబంధిత గుత్తేదారుడు పత్తాలేకుండా పోయాడు. ఇకనైనా అసంపూర్తి రోడ్డు పనులకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.